**గేటు తీసిన సవ్వడి వినిపించి తల ఎత్తి చూద్దును కదా, మా వామనరావు నెమ్మదిగా లోపలికి వస్తున్నాడు. చాలా నెమ్మదిగా నడిచి వచ్చి దిగులుగా కుర్చీలో కూలబడ్డాడు.**

నేను ఆశ్చర్యపోయాను. వాడెప్పుడూ అలా దిగాలుగా ముర్రోజుగా వుండడు. నిరంతరం ఫ్రెష్‌గా గాలికొట్టిన బెలూన్‌లాగా హుషారుగా నవ్వుతూ పేలుతూ తుళ్ళుతూ దొర్లుతూ వుండడం వాడి నైజం. చేస్తున్నది చిన్న తాత్కాలిక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగమైనా వయసువల్లా, నిష్పూచీవల్లా, తల్లిదండ్రులకు ఒక్కడే ముద్దుల కొడుకు కావడంవల్ల వాడు ఆడింది ఆట పాడింది పాట. మొన్న తొమ్మిదో తారీకునేకదా, వాడు రోజంతా ఉత్సాహంల సీమ టపాకాయల గుత్తిలాగా హుషారుగా పేలిపోతూ కనిపించాడు? అంతేకాదు నిన్నటికి నిన్న, రాత్రి పదిగంటలు దాటిన తర్వాత సెంటర్లో వాణ్ణి ఎలాటి స్థితిలో చూశాను!

జనవరి తొమ్మిదో తారీకున ఉదయం మా యింటికి వచ్చి రేడియోకు అంటుకుపోయి కూర్చుని చెవుల్లో యింకేమీ దూరనీయకుండా హుషారుగా ఊగిపోతూ కూర్చోలేదూ? రేడియోలో "రహితన్నా! దెహెవుడు సృష్టించిన భూమికి శిస్తేమిటన్నా? నెహేటితో దాన్ని రద్దుచేస్తున్నాం" అన్న అరుపులు వినిపించేసరికి అదిరిపడి "విప్లవం.. మహావిప్లవం. ఈ దెబ్బతో కమ్యూనిస్టులు కూడా చిత్తయిపోయినట్టే.. జై.. జై.." అని పెడబొబ్బలు పెడుతూ కుర్చీలోనుంచి కిందపడిపోయి ఆనందంతో కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. నేను కల్పించుకుని "అది విప్లవమూ కాదు. నీ మొహమూ కాదు. ఇంతకుముందే మన పాత అసమర్థపు ఆత్మగౌరవం లేని ప్రభుత్వం చిన్న మాగాణి, మెట్ట కమతాలకు శిస్తు రద్దు చేసింది. ఇప్పుడీ శిస్తు రద్దువల్ల బాగా కలిగిన భూస్వాములకు మాత్రమే లాభం. అదీ ఎంత. కొంచెంమాత్రమే...." అంటూ వుంటే నన్నొక అబద్ధాల పుట్టని చూసినట్టు చూశాడు.

అప్పుడే మా యిల్లు గలావిడ కల్పించుకుని "పల్లెలో భూమిని దేవుడు సృష్టించాడని శిస్తురద్దు చేశారు. బాగానే వుంది. మరి బస్తీల్లో పట్నాల్లో భూమిని ఆ దేవుడు కాదా సృష్టించింది? దీనికీ పన్ను రద్దు చేస్తారా?" అని అడిగింది. ఆమె ధర్మాకాలపు పిచ్చి మాలోకమను కోండి!

మళ్ళీ నిన్నటి రాత్రి పది గంటల తర్వాత ఆ సెంటరు సెంటరంతా మా వామనరావు పైపు చప్పట్లతో భయంకరంగా, భీభత్సంగా కలకలలాడిపోయింది. నేనప్పుడే బస్సు దిగివస్తూ చూశాను. ఆ సెంటర్లో నిలువెత్తు వేదికమీద రికార్డు డాన్సులు జరుగుతున్నాయి. ఆ ప్రదేశమంతా ఈలలతో కేకలతో రణగొణధ్వనితో కురుక్షేత్రంలాగా కుంభమేళాలాగానూ కలకలలాడిపోతోంది.


ఒకడు విశ్వవిఖ్యాత నటసార్వభౌముణ్ణీ, వేరొకడు 'నటసామ్రాట్' నూ అనుకరిస్తూ వొంటిమీద దుస్తులే గమనించని ఆడ శాల్తీలతో గంతులేస్తూ వుంటే ముందు వరుసలో కూర్చుని ఆవేశంతో ఊగిపోతూ దర్శనమిచ్చిన వాడు వామనరావే కదా? నేనూ రోడ్డు మూసుకబడి వుండడంచేత కొద్దినిముషాలక్కడ నిలబడక తప్పిందికాదు మరి ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆ వేదికమీద వి.వి.న. సార్వభౌముణ్ణి అనుకరిస్తున్నవాడు యధాశక్తి కప్పలాగా గంతులేస్తూ ఆ అమ్మాయి తొడలమీద కాళ్ళువేస్తూ దగ్గరికి లాగి హత్తుకుంటూ బాగానే అనుకరిస్తున్నాడనిపించింది చెప్పొద్దూ!

మరియిప్పుడు వామనరావు వాలకం ఇలా వుందేమిటి? ఏమయింది వీడికి?

నెమ్మదిగా "ఏమిటలా వున్నావు?" అని అడిగాను. అంతే కళ్ళనీళ్ళ పర్యంతం అయి "మా నాన్న వచ్చాడు రాత్రి" అన్నాడు! "వచ్చి?" అన్నాన్నేను. "వెళ్ళిపోయాడు పొద్దున్నే" అన్నాడు. "అదే చెప్పు.. .ఆయన రావడం, వెళ్ళడం మధ్య ఏం జరిగింది?" "మా వూళ్ళో మాకు మూడెకరాల పొలం వుంది కదా? ఆ పక్కనే ఒక మోతుబరి ఆసామికి పద్దెనిమిదెకరాల పొలం వుంది. ఒకటే ఖండం. ఆయనకు ఆరుగురు కొడుకులు, ఐదుగురు కూతుళ్ళు, అల్లుళ్ళు, ఇతర్లూ అంతాగొప్ప బలగం. ఆ వూళ్ళో వాళ్ళకు తిరుగులేదు."

"ఇప్పుడు వాళ్ళ సంగతి ఎందుకు? నీ సంగతి ఏమిటో చెప్పు" వామనరావు చెప్పలేకపోతున్నాడు. గుటకలు వేస్తున్నాడు. ఇంతలో లోపలినుంచి కాఫీ వచ్చింది. అందుకుని దిగులుగా చప్పరిస్తూ కూర్చుని నేల చూపులు చూస్తూ, మధ్య మధ్య ఇంటి పై కప్పువంక చూస్తూ ముక్కలు ముక్కలుగా వృత్తాంతమంతా చెప్పాడు. ముక్కలన్నీ కలిపితే ఇలా తయారవుతుంది కథ-

అలా వాళ్ళ పొలం పక్కన బలవంతుడూ, ఐశ్వర్యవంతుడు, కులం వగైరాల చేత కూడా శక్తిమంతుడూ పలుకుబడి కలవాడు ఒకడున్నాడు. ఒకరోజు ఉదయం వామనరావు తండ్రి–అసలే పిట్టంతమనిషి– పొలానికి పోతే గట్టు నాలుగడుగులు లోపలికి జరిగివుంది. మూడోరోజు చూస్తే ఆరడుగులు జరిగివుంది. ఆరో రోజున ఇంకా కుదించుకుపోయివుంది. ఆయన కళ్ళు తలా తిరిగిపోయాయి. "ఇదేమి అన్యాయం" అని వాళ్ళ యింటికి పరుగెత్తుకుంటూ వెళ్ళి అడిగితే ఆ పెద్ద మనిషి ముందు అంతా అబద్ధమనీ, కళ్ళు చెదిరాయేమోననీ బుకాయించి, ఆ తర్వాత నవ్వులకు పడ్డాట్ట. "అయినా బూమీ, నీరూ, గాలీ ఇయన్నీ ఎవడబ్బ సొమ్ము పంతులూ? దేహేవుడు సృష్టించిన ఈ బూమి నాదనీ నీదనీ అన్డం తప్పుకదా? అలాగని నేననడంలేదు. మన ముఖ్యమంత్రిగారే అన్నారు కోసి. దానికి నువ్వు శిస్తు కట్టావా? నేన్జూడు పందొమ్మిదెకరాలకు నచ్చిచెడి పస్తులుండి






శిస్తులు కట్టాను. పుట్టినప్పటాల నించీ. ఇహ.. ఇప్పుడు.. మిగిలిందే నీదనుకో.. దేనికైనా తృప్తి లేకపోతే సుకంలేదు వంతులూ!" అన్నాడు.

వామనరావు తండ్రి లబలబ లాడుతూ మొత్తుకుంటూ కరణం దగ్గరికి పరుగెత్తుకు పోయాడు.

ఆయన తీరిగ్గా భోంచేసి. (లేక భోంచేసి తీరిగ్గా) వరండాలో నవారు మంచంమీద చిద్విలాసంగా పడుకుని అనవసరంగా విసని కర్రతో విసురుకుంటూ ఈయన చెప్పిందంతా విని చిన్మయంగా నవ్వి "నాయనా! నా దగ్గరి కిప్పుడా వచ్చావు? నే నిప్పుడేమీ కాను. వొట్టి వెంకట్రామయ్యను మాత్రమే. మొన్ననే రికార్డులన్నీ అప్పగించేసి రశీదు పుచ్చుకున్నాను. బంధాలన్నీ తెంపేసుకుని తెరిపినపడ్డాను. ఇహ అయిదూ, పది కోసం పరుగెత్తడాలూ అనవసరపు తాపత్రయాలూ లేవు. ఉన్నదేదో తృప్తిగా హాయిగా తినడం కృష్ణారామా అనుకుంటూ తొంగోడం అంతే. అందువల్ల నా దగ్గిరికి రావడం వేస్టు....ఎవడి దగ్గరికి పోవడమైనా వేస్ట్....మూడేసి వూళ్ళకు వాడెవడో ఒక అధికారి ఎప్పుడో వస్తాట్ట....వచ్చేదాకాఆగి వాడు వింటే...వాడి కర్తమైతే ... వాడి తో మొర పెట్టుకో. ఇక వెళ్ళు....ఏళ్ళ తరబడి అలిసి పోయాను తిరిగి తిరిగి .... హాయిగా నిద్ర వొస్తున్నది. నువ్వీక వెళ్ళరా.... అన్నట్టు మళ్ళీరాకు....వెళ్ళు" అన్నాడు.

వామనరావు తండ్రి ఉరుకులు పరుగుల మీద వచ్చి కొడుక్కి విషయాలు చెప్పి. "ఇంకెంత లోపలికి పోయిందో! ఇక గట్టు వదలకుండా అక్కడే మంచం వేసుకుని పడుకుంటాను!" అంటూ అదరాబాదరాగా వెళ్ళిపోయాడు. అదీకథ!

క్రిందటి డిసెంబరు నెలనుంచీ ఇప్పటి వరకూ ఈ వామనరావు అటో్ప నేలమీద నడిచాడా? ఇప్పుడు మౌనంగా నేలచూపులు చూస్తూ కూర్చున్నాడు. అతన్ని చూస్తే జాలి వేసింది కాని ఏంచెయ్యగలం?

**కరివేపాకు మొక్కమీద ఎంగిలి చెయ్యి కడుక్కునే బాపతు మనిషి పరిపాలనలో ఇలాంటి కథలెన్నెన్నో!**